వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 15 డిసెంబర్ 2024






## పించ డ్యామ్‌ను సందర్శించిన సబ్ కలెక్టర్ నైదియా దేవి

సుండుపల్లి, డిసెంబర్14,ప్రభాతవార్త:



సుండుపల్లి మండలం పించ డ్యామ్ ను సబ్ కలెక్టర్ నై దియా దేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరామయ్య అలాగే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బుక్కే నాగేంద్ర నాయక్ సబ్ కలెక్టర్‌కు ప్రాజెక్ట్ యొక్క వివరాలు అలాగే ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతి గురించి, ప్రాజెక్టులో ఇంకా చేయవలసిన పనుల గురించి అలాగే ఇప్పటివరకు జరిగిన పనుల గురించి వివరంగా తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రదేశంలో వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉందని, వచ్చే పర్యాటకులకు మరిన్ని వసతులు, అలాగే పార్కు లాంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. అలాగే అందుకు సంబంధించిన అంచనాలు కూడా తయారుచేసి నివేదికలు పంపాలన్నారు. అనంతరం అధికారులు మత్స్యశాఖ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి డ్యామ్ లో చేపలు వదిలే ఆలోచన కూడా ఉందని సబ్ కలెక్టర్ కు తెలియ పరిచారు. ఈ ప్రాజెక్టుకు వచ్చే జల వనరుల గురించి అలాగే ఈ ప్రాజెక్టు నుంచి దిగువన ఉండేటటువంటి జల వనరుల గురించిన ఒక మ్యాప్‌ను పంపించాల్సిందిగా సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## 15 సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

రాయచోటి డిసెంబరు14 ప్రభాతవార్త



నేడు నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలలో రాయచోటి నియోజకవర్గం ఆరు మండలాల్లోని మొత్తం 15 సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మొత్తం 15 సాగునీటి వినియోగదారుల సంఘాలకు తెదేపా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి వినియోగదారుల సంఘాలను నిర్వీర్యం చేసి ఎన్నికలు నిర్వహించకపోవడంతోపాటు వాటి నిర్వహణను అస్సలు పట్టించుకోకపోవడం వల్ల సాగులో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరిగి సంఘాలకు సభ్యులు ఏర్పడడంతో నిర్వహణ మెరుగవుతుందన్నారు. అంతేగాక వీటి నిర్వహణకు ప్రభుత్వం నుంచి కూడా పూర్తి సహకారం అందుతుందన్నారు. నియోజకవర్గంలో తెదేపాకు పూర్తిగా మద్దతు తెలిపి ఈ ఎన్నికలను ఏకగ్రీవం చేయడం పట్ల సాగునీటి సంఘాలు మరియు ప్రజలందరికి మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.

# సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి హవా..!

- ఎన్నికలను బహిష్కరించిన వైసిపి
- ఏకగ్రీవాలతో ఆదరగొట్టిన కూటమి నేతలు
- వర్గపోరున్న చోట పలు సాగునీటి సంఘాల ఎన్నికల్లో కొనసాగిన తోపులాటలు,. వాగ్వివాదాలు..
- తెదేపా, జనసేన, బిజెపి నేతల మధ్యే చాలా చోట్ల పోటీ వాతావరణం
- భవిష్యత్తు స్థానిక సంస్థల ఎన్నికలపై హామీలతో సర్దుబాట్లు
- ఎన్డీయే కూటమి నేతల సంబరాలు



అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త

శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి హవా కొనసాగింది. ఈ ఎన్నికలను వైసిపి బహిష్కరించడంతో ఎన్డీయేకు దాదాపుగా ఎదురులేని పరిస్థితులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. అత్యధిక సాగునీటి సంఘాలను ఎన్డీయే కూటమి నేతలు ఏకగ్రీవాలతో అదరగొట్టారు. గత మూడురోజులుగా సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి కూటమి ముఖ్యనేతలు ఏకగ్రీవం చేసుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. కూటమిలో నెలకొన్న పోటీ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని నేతల మధ్య విబేధాలు తలెత్తకుండా భవిష్యత్తు స్థానిక సంస్థల ఎన్నికలపై హామీలిచ్చి సర్దుబాటు యత్నాలు చేశారు. వర్గపోరున్న చోట సాగునీటి సంఘాల ఎన్నికల్లో తోపులాటలు, వాగ్వివాదాలు, హెచ్చరికలు షరామామూలుగా కొనసాగాయి. ఎన్నికల్లో ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు. ఆయా మండలాల పరిధిలోని సిఐలు,ఎస్ఐలు ఇతర పోలీసు సిబ్బందితో కలిసి తహసిల్దార్లు, ఇరిగేషన్ అధికారులు ఎన్నికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమాచారాన్ని తెలుసుకుంటూ చాలాచోట్ల సజావుగా ఎన్నికలు ముగిసేందుకు కృషి చేశారు. కూటమి నేతల మధ్య సయోధ్య కరవైన చోట పోటీ వాతావరణం తప్పలేదు అయితే జిల్లా వ్యాపితంగా సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి హవా కొనసాగడంతో ఆయా మండలాల్లో కూటమికి చెందిన తెదేపా, బిజెపి, జనసేన నేతలు గెలిచిన సాగునీటి సంఘాల ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్లు, డైరెక్టర్లతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగకపోవడం వల్ల కూడా ఈ ఎన్నికల పట్ల గ్రామాల్లోని రైతులు ఆసక్తి కనబరిచారు. సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం ద్వారా రానున్న రోజుల్లో ప్రత్యే క నిధులు ఈ సంఘాలకు ఏర్పాటు చేస్తారని, తద్వారా చెరువుల మరమత్తులు ఇతర అభివృద్ధి పనులు చేసుకునేందుకు పరిస్థితులు సానుకూలమవుతాయన్న ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. కనుక ప్రభుత్వం ఎన్నికలతో సరిపెట్టకుండా సాగునీటి సంఘాలకు ప్రత్యేక నిదులు కేటాయించాల్సిన అ వసరాన్ని గుర్తించాల్సి ఉంది. జిల్లాలోని రాజంపేట, రాయచోటి, మదనపల్లి డివిజన్ పరిధిలో 167 సాగునీటి సంఘాలున్నాయి. వీటి క్రింద దాదాపుగా 58వేల పైచిలుకు ఆయకట్టు ఉంది. వెలిగల్లు జలా శయం క్రింద సాగునీటి సంఘాలు ఏర్పాటు చేయకపోవడం, అన్నమయ్య జలాశయం ఎర్త్ డ్యామ్ కొట్టు కుపోయిన నేపథ్యంలో ఈ జలాశయం క్రింద సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకుం డాపోయింది. ఆయా సాగునీటి సంఘాల ఆయకట్టులో రైతుల మధ్య విబేదాలు తలెత్తకుండా ఉండేందుకు ఆ ఆయకట్టులో ఉన్న ఆదర్శ రైతులకు సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్లు, డైరెక్టర్లుగా ఎన్నికోవాలన్న ప్రతిపాదన వచ్చినా వర్గ రాజకీయాలు, పరపతి కలిగిన నేతలే ఈ సాగునీటి సరఘాల ఎన్నికల్లో సత్తా చాటుకున్నట్టు సమాచారం. అన్నమయ్య జిల్లాలో ఉమ్మడి కడప జిల్లా నుండి వచ్చిన నియోజకవర్గాల్లో కంటే, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి వచ్చిన నియోజకవర్గాల్లోనే సాగునీటి సంఘాలతో పాటు ఆయకట్టు అత్యధికంగా ఉన్నాయి. ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గాల పరిధిలో 72, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో 95 సాగునీటి సంఘాలున్నాయి.

**- పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు**

అన్నమయ్య జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు పటిష్టమైన భద్రత మధ్య ప్రశాంతంగా ముగియడంతో పోలీసు అధికారులను, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఎస్పీ ఆదేశాలతో పట్టిష్టమైన భద్రతతో పాటు, గ్రామాల్లో గొడవలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలపై ఆయా మండలాల పరిధిలో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎక్కడైనా సమస్యలు సృష్టించాలని చూస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా ఎస్పీ ముందస్తుగా హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. అలాగే ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సలహాలు, సూచనలు పోలీసు అధికారుల సమీక్షల్లో ఎస్పీ చేయడంతో ఎన్నికలు దాదాపుగా చిన్నపాటి సంఘటనలు మినహా ప్రశాంతంగా జిల్లాలో ముగిశాయి.

## రోడ్డు ప్రమాదంపై మంత్రి దిగ్భ్రాంతి

రాజంపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త :



అన్నమయ్య జిల్లా,రాజంపేట కొత్త బోయినపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అతి వేగంతో యువకులు ప్రమాదాల బారినపడి ప్రాణాల కోల్పోవడం చాలా బాధకరంగా ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## బద్వేలు చిన్నతూము ఆయకట్టు చైర్మన్‌గా కొర్రపాటి సురేంద్ర

బద్వేలు, డిసెంబర్ 14 ప్రభాతవార్త :



బద్వేలు చిన్నతూము ఆయకట్టు చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన కొర్రపాటి సురేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన నీటి సంఘం ఎన్నికలలో భాగంగా చిన్న తూము ఎన్నికపైఉత్కంఠ సాగింది. 12 టీసీలు నామినేషన్లు దాఖలు చేశారు. సమయం ముగిసేసరికి ఇతర పార్టీలకు చెందిన ఏ ఒక్కరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో 12 నామినేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. వీరిలో కొర్రపాటి సురేంద్రను చైర్మన్‌గా ఎన్నుకోగా, వైస్‌చైర్మన్ గా సిద్దమూర్తి చెన్నారెడ్డిని టీసీలు ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి వారికి ధృవీకరణపత్రాన్నిఅందించారు. వీరితోపాటు టీసీలుగా వాయిలేటి శ్రీనివాసులు, గానుగపెంట శ్రీనయ్య, పెద్ద రంగారెడ్డి, పసుపులేటి బాలయ్య, మజ్జారి సుబ్బయ్య, పచ్చా రమణయ్య, గొర్రెపొట్టెయ్య, కోన పెద్ద సుబ్బారెడ్డి, గాజులపల్లె రాఘవరెడ్డి, కొమ్మినేని వెంకటసుబ్బయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ కొర్రపాటి సురేంద్ర మాట్లాడుతూ జనసేన తరపున నాకు అవకాశం ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వీరితోపాటు సింగసాని బుజ్జి, వెంగళరెడ్డి, మిత్తికాయల రమణ,నరసింహనాయుడు,బాలిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు మురళిలు సహకారం అందించారని వారు తెలిపారు.

## చెన్నంపల్లె ఆయకట్టు సంఘం చైర్మన్‌గా వెంకటరమణారెడ్డి

బద్వేలు, డిసెంబర్ 14 ప్రభాతవార్త :



చెన్నంపల్లె చెరువు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షునిగా టీడీపీ మద్దతుదారులైన ఈగ వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్‌గాగా జులపల్లె వెంకటసుబ్బారెడ్డిలు ఎన్నికయ్యారు. ఆయకట్టు కింద జరిగిన ఎన్నికలలో 12 మంది టీసీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్‌గా వెంకట రమణారెడ్డి, వైస్‌చైర్మన్‌గా వెంకట సుబ్బారెడ్డిలను అధికారుల సమక్షంలో మెంబర్లు ఎన్నుకున్నారు. వీరితోపాటు ఈసీగా వాకమళ్లసుధాకర్‌రెడ్డి, గోడి సునీత, దున్నూతల నారాయణమ్మ, వనపర్తి వంశీ, గాజులపల్లె జయరామిరెడ్డి, బాలయ్య, బిజివేముల నారాయణరెడ్డి, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, జయరామిరెడ్డిలు ఎన్నికయ్యారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ టీడీపీ సమన్వయకర్త రితేష్‌రెడ్డి , బీజేపీ నాయకులు రోశన్న, చైర్మన్ వెంకటరమణారెడ్డిలను అభినందించారు.

## మీరు నేర్పిన ప్రజాస్వామ్యమే పాటిస్తున్నాం

### మీ డొల్లతనం బయటపడుతుందనే బహిష్కరణ డ్రామా

పులివెందుల, డిసెంబరు 14, ప్రభాతవార్త :



నియోజకవర్గంలో ప్రతి తెదేపా నాయకుడు, కార్యకర్త తిరిగేలా గౌరవం తెస్తానని, ఎంపీ అవినాష్ రెడ్డి ఎలక్షన్ గెలవలేని దద్దమ్మలు అంటూ ఏడుపు గొట్టు మాటలు మాట్లాడాడని నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. పులివెందులలోని తెదేపా కార్యాలయం నందు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపాలనలో నియోజకవర్గంలో ఎటువంటి రాజకీయాలు చేశారో అందరికీ తెలుసని స్థానిక సంస్థల ఎన్నికల సమయాల్లో ఎంపీడీవో కార్యాలయాల వద్ద జీపులు అడ్డుపెట్టి, కుర్చీలు వేసుకుని కూర్చుని నామినేషన్ వేయడానికి వచ్చిన తెదేపా నాయకుల నామినేషన్ పత్రాలను గుంజుకొని దౌర్జన్యాలకు పాల్పడింది మీరు కాదా అని మీరు నేర్పిన పాఠం ప్రకారమే మేము కూడా చేస్తే ఏడుపు గొట్టు మాటలు మాట్లాడడం ఏమిటన్నారు. ప్రస్తుత నీటి సంఘాల ఎన్నికల్లో ఒక్కరు కూడా టాక్స్ కట్టుకుంటామని ఎవరు కూడా రాలేనీ పరిస్థితి వుండటంతో మీ యొక్క డొల్లతనం బయటపడుతుందనే బహిష్కరణ డ్రామా ఆడుతున్నారన్నారు. గత ఐదేళ్లలో మీరు ఏ విధంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించారో మేము కూడా రెట్టింపులో ఈ ఐదు సంవత్సరాలు అలాగే పరిరక్షిస్తామన్నారు. నియోజవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించిన నాడే పులివెందుల ప్రాంతంలో ప్రతి తెదేపా నాయకుడు, కార్యకర్తల గౌరవాన్ని కాపాడతానని ప్రమాణం చేశానన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి గెలవలేక దద్దమ్మ రాజకీయాలు చేస్తున్నారని తెదేపా వారిని విమర్శించారని, నిజాలు మాట్లాడాలని గతంలో కూడా పులివెందుల మున్సిపాలిటీలో గాని, చుట్టుపక్కల గ్రామాల్లో కానీ ఎక్కడైనా తెదేపా వారిని పోటీ చేసే అవకాశం ఉన్నదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు దేవి రెడ్డి సంజీవరెడ్డి, పట్టణ తెదేపా అధ్యక్షులు కొరియర్ ప్రసాద్ రెడ్డి, మైనార్టీ నాయకులు రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి

రాజంపేట డిసెంబర్ 14 ప్రభాత వార్త.





కడప చెన్నై ప్రధాన రహదారి రాజంపేట మండలం బోయనపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ఈ సంఘటనలో కర్నూలు జిల్లా కోవెలకుంట్లకు చెందిన శ్రీ కిరణ్20,కడప జిల్లా పులివెందులకు చెందిన బన్నీ 21,మృతి చెందారు. మన్నూరు సిఐ మహమ్మద్ అలీ కథనం మేరకువివరాలు ఇలా ఉన్నాయి. మృతులు ఇరువురు ఒకరు రాజంపేట అన్నమయ్య ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం సీఎస్ ఈ చదువుతుండగా,మరొకరు చెన్నైలోఇంజనీరింగ్ చదువుతున్నారు. అన్నమయ్య కళాశాలలో చదివే విద్యార్థికి శనివారం పుట్టినరోజు కావడంతో అతని స్నేహితుడైన చెన్నైలో చదివే విద్యార్థి బర్తడే శుభాకాంక్షలు తెలిపేందుకు రాజంపేటకు వచ్చారు. వీరి ఇరువురు ద్విచక్ర వాహనంలో వెళుతూ ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్టేక్ చేయబోగా బస్సును ఢీకొని వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. శవాలను శవ పరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పత్తా లేని ప్రతిపక్షం హవా చూపిన అధికారపక్షం

### నీటి సంఘాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్న కూటమి నాయకులు

రాజంపేట డిసెంబర్ 14 ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికలు రాజంపేట రైల్వే కోడూరులలో ప్రశాంతంగా నిర్వహించారు. ఈ ఎన్నికలకు ప్రతిపక్ష నాయకులు పత్తా లేకుండా పోయారు. దీంతో ఈ రెండు నియోజకవర్గాలలో సాగునీటి సంఘం ఎన్నికల్లో అధికార పార్టీ హవా చూపింది. రాజంపేటలోని 6, కోడూరు నియోజకవర్గంలోని తొమ్మిది నీటి సంఘాలను ఏకగ్రీవంగా కూటమి నాయకులు కైవసం చేసుకున్నారు. రాజంపేట నియోజకవర్గం లో కూటమి పార్టీలో అధికంగా నాయకులు ఉన్నప్పటికీ ఎక్కడ ఎలాంటి చిన్న సమస్యలు కూడా తలెత్తకుండా ఆయా ప్రాంతల కూటమి నాయకులు పోలి సుబ్బారెడ్డి, జగన్మోహన్ రాజు, మేడ విజయ్ శేఖర్ రెడ్డి, యల్లటూరి శ్రీనివాసరాజు, సుగువాసి బాలసుబ్రహ్మణ్యంలు వారి వారి హవా ఉన్న ప్రాంతాలలో నీటి సంఘం అధ్యక్ష కార్యదర్శులు, టీసీ నెంబర్లను ఏకగ్రీవం చేసుకొని వారి వారి హవాలను చాటుకున్నారు. ఈ ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మన్నూరు సీఐ మహమ్మద్ అలీ, డి.ఎస్.పి సుధాకర్ ఆదేశాల మేరకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి ఎన్నికలను సజావుగా జరిపించారు. ఇదే విధంగానే రైల్వే కోడూరు నియోజకవర్గం లో కూడా సిఐలు వెంకటేశ్వర్లు, హేమ సుందర్ రావు లు కూడా గట్టి బందోబస్తు చేసిఎన్నికలు నిర్వహించారు.రాజంపేటలో జరిగినఐదు చెరువులోరెండు స్ప్రింగ్ చానల్స్ కు సంబంధించి ఎన్నికలు జరగగా వాటన్నింటినీ కూటమి నాయకులు వారి వారి సత్తాల మేరకు ఏకగ్రీవంచేసుకున్నారు. చివరగా ఎన్నికైన నీటి సంఘాల చైర్మన్ ఉప చైర్మన్ లకు డైరెక్టర్లకు ఎన్నికలకు సంబంధించి డిక్లరేషన్ పత్రాలను కూడా రెండు నియోజకవర్గాలలోని ఆయా ఏవోలు అందజేశారు. రాజంపేట రైల్వే కోడూరు నియోజకవర్గం లోని అతి పెద్ద చెరువు అయినా పోలి చెరువు నీటి సంఘానికి నా అధ్యక్షుడిగా నాగినేని నాగేశ్వర నాయుడు వైస్ చైర్మన్ గా పసుపులేటి పెంచలయ్యతో పాటు ఐదు మంది డైరెక్టర్లను ఎన్నుకోగా తాళ్లపాక నీటి సంఘం అధ్యక్షుడిగా జవాజి అదృష్ట దీవుడు, ఉపాధ్యక్షుడిగా రాత కొండ వెంకటేష్ తో పాటు డైరెక్టర్లును ఎన్నిక చేశారు. ఊటుకూరు నీటి సంఘం అధ్యక్షుడు గా నామ హరినాథ్, ఉపాధ్యక్షురాలుగా చెన్నమ్మ, హస్తవరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా ఆవుల యానాదయ్య, ఉపాధ్యక్షురాలుగా కొందూరు రుక్మిణి అమ్మ, మన్నూరునీటి సంఘం అధ్యక్షుడుగానారదాసు రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా బాలరాజు కృష్ణంరాజు, గుండ్లూరు స్ట్రింగ్ ఛానల్ అధ్యక్షురాలుగా ముమ్మడి స్వప్న, ఉపాధ్యక్షురాలుగా అరవ రాములమ్మ, మందపల్లి స్ట్రింగ్ ఛానల్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా అద్దేపల్లి పురుషోత్తం రాజులతో పాటు ఆయా నీటి సంఘాల డైరెక్టర్లును కూడా ఏకగ్రీవంగా ఎన్నిక చేసి కూటమి నాయకులు వారి హవానుచాటుకున్నారు.ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష ఉపాధ్యక్ష నెంబర్లకు నాయకులు సన్మానాలు చేసి ఘనంగా రెండు నియోజకవర్గాలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి ఎన్నికగా వారి సత్తాను చాటుకుని సంబరాలు జరుపుకున్నారు.



## నేడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లాకు రాక

రాయచోటి, డిసెంబర్ 14 ప్రభాతవార్త



రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం, అన్నమయ్య జిల్లా, రాయచోటికి రావడం జరుగుతుంది. మంత్రి డిసెంబర్ 15, వ తేదీ ఆదివారం ఉదయం 6:30 గంటలకు విజయవాడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 12:30 గంటలకు రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం మంత్రి ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుంది.

## 20 కుటుంబాలు బీజేపీలో చేరిక

గోపవరం, డిసెంబర్ 14 ప్రభాతవార్త



గోపవరం మండలం పెద్ద గోపవరంలో బిజెపి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం 20 కుటుంబాలు బిజెపిలో చేరాయి. రజక కులస్తుల నాయకుడు రాజగోపాల్ అలియాస్ వేణుగోపాల్ మరియు 20 కుటుంబాలు స్వచ్ఛందంగా ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలను చూసి బిజెపిలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు తిప్పలూరి రామ సుబ్బారెడ్డి కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు., ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుటకు నరేంద్ర మోడీ గారి కృషి అనిర్వ చనీయమని చెప్పాడు. నేడు నడుస్తున్నటువంటి ప్రజా సంక్షేమ పథకాలు సిమెంట్ రోడ్లు. త్రాగునీటి సౌకర్యం. మధ్యాహ్న భోజన పథకం. అంగన్వాడి సెంటర్లు. వీధిలైట్లు. ప్రతి వ్యక్తికి ఐదు కేజీల ఉచిత బియ్యం మొదలగు సంక్షేమ పథకాలన్నీ కేంద్రంలోని నరేంద్ర మోడీ గారు ఇస్తున్నవేనన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిషన్ మోర్చా జిల్లా కార్యదర్శి పేరయ్య, నియోజకవర్గ బిజెపి నాయకుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పించ డ్యామ్ ఎన్నిక వాయిదా

సుండుపల్లె, డిసెంబర్ 14,ప్రభాతవార్త:



మండల పరిధిలో అధికార పార్టీకి చెందిన కూటమి నేతల మధ్య విభేదాల కారణంగా వాగ్విధాలు నడుమ నీటి సంఘం ఎన్నికలు జరిగాయి. పింఛా ప్రాజెక్టుకు సంబంధించిన నీటి సంఘం ఎన్నికలను పింఛా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసుల భారీ బందోబస్తు నడుమ నిర్వహించారు. ఆక్కడ ఎంపీ డీ వో సుధాకర్ రెడ్డి ఎన్నికల అధికారిగా ఉన్నారు.ఉదయం నామినేషన్ల ప్రక్రియ నుండే సుగవాసి బాలసుబ్రమణ్యం, జగన్మోహన్ రాజు వర్గీయుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. రెండు వర్గాల వారు పరస్పరం గొడవ పడుతుండడంతో ఎన్నికలకు అంతరాయం ఏర్పడింది. దీంతో టి సి రూములలో అధికారులు, ఓటర్లు మాత్రమే ఉండాలని, మిగతా ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలను టి సి రూమ్ ల నండి పోలీసులు బయటకు పంపే క్రమంలో ఒక వర్గంలోని కూటమి కార్యకర్తలు కొందరు ఒక పోలీసు ఉన్నత స్థాయి అధికారితో దురుసుగా ప్రవర్తించి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల వారితో వాగ్వాదాలు జరుగుతున్న కారణంగా ఎన్నికల అధికారి సుధాకర్ రెడ్డి విషయాన్ని పై అధికారులకు తెలియజేశారు. దీంతో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్సై సుధాకర్, వీరబల్లి ఎస్ఐ మోహన్ నాయక్ పోలీస్ సిబ్బంది ఎన్నికల కేంద్రానికి వచ్చి బందోబస్తును నిర్వహించారు. విషయం తెలుసుకున్న రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి ఎన్నికల కేంద్రానికి సందర్శించారు. జరిగిన సంఘటనలను గురించి ఎన్నికల అధికారి సుధాకర్ రెడ్డిని, ఇరువర్గాల నాయకులను అడిగి విషయాన్ని తెలుసుకున్నారు. ప్రాజెక్టు జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరామయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర నాయక్ తో పాటు ఇరువర్గాల నాయకులతో చర్చించి ఎన్నికలను వాయిదావేశారు.

## లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం, డిసెంబర్ 14, ప్రభాతవార్త



మండలంలోని వల్లేరవారి పల్లె గ్రామంలో వెలిసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు మార్గశిర మాసం ఆరంభం రెండవ శనివారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజ అలంకారం నిర్వహించడం జరిగినది. తదుపరి స్వామిని దర్శించుకున్న పలువురు భక్తులు మాట్లాడుతూ స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దగ్గర 11 ప్రదక్షణ లు చేసి స్వామి వారికి ఉన్న నామమును చూస్తే ప్రత్యక్షంగా పలు రకాల స్వామి రూపాలు కనపడతాయని, అలా కనపడిన దృశ్యానికి 41 రోజులు పూజ చేసుకుంటే సంకల్పం నెరవేరుతుం దని పలువురు భక్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించి,అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఈ అన్నదాన కార్యక్రమానికి కడప నగరం, విజయ దుర్గా కాలనీకి చెందిన దర్మిశెట్టి శ్రీనివాసులు , సతీమణి నాగవేణి వీరి కుమారులు సహకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొనడం జరిగినది

## వృద్ధాశ్రమానికి మా వంతు సేవలందిస్తాం

### : ఈటీవీ డి-13 డ్యాన్సర్స్ మణికంఠ, తేజ

బద్వేలు అర్బన్, డిసెంబర్ 14 ప్రభాతవార్త :

అనేక కారణాలతో ఆసరా కోల్పోయిన అనాథ వృద్ధులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈటీవీ డి-13 డ్యాన్స్ మాస్టర్స్ మణికంఠ, తేజలు అన్నారు. శనివారం ఉదయం బద్వేలులోని ఓ వివాహ వేడుకకు విచ్చేసిన వారు పట్టణంలోని ఆనంద నిలయం, నిరాశ్రయుల వసతిగృహం వృద్ధాశ్రమాన్ని వారు సందర్శించారు. అక్కడ ఉన్నటువంటి అనాథ వృద్ధులను ప్రేమ, ఆప్యాయతగా పలువురిని పలకరిస్తూ వారికి పండ్లు, స్వీట్లు ,తినుబండారాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఇలాంటి వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ ఆసరాలేని అనాథ వృద్ధులను ఆదుకోవడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా వారు ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవికుమార్ సేవలను అభినందించారు. భవిష్యత్తులో ఆశ్రమానికి తమవంతు తోడ్పాటునందిస్తామన్నారు. అనంతరం శివసాయి ఈవెంట్స్ సాయి మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో గత 8 సంవత్సరాలుగా పిడతల రవికుమార్ అనేకమంది వృద్ధులను చేరదీసి వారి బాగోగులు చూసుకుంటూ నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాలను వారికి ఏర్పాటు చేస్తూ తన మానవత్వం చాటుకోవడం గొప్ప విషయమన్నారు.ఈ కార్యక్రమంలో పత్తి హరీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



